క్లుప్తంగా

'స్పందన'కు 23 అర్జీలు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 23 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని 11 కేవీ నక్కవానిపాలెం ఫీడర్, 33/11 కేవీ వాటర్ వర్క్స్ హెచ్‌బీ కాలనీ సెక్షన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, జయభేరి, క్రాంతినగర్, కాకతీయ ఫంక్షన్ హాల్, 60 ఫీట్ రోడ్డు, శారద స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పోర్ట్ పెన్షనర్ల సమస్యలపై చర్చ



డైరీని ఆవిష్కరిస్తున్న సనపల బంగారురాజు, అసోసియేషన్ సభ్యులు

మురళీనగర్: హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సభ్యులందరూ కలిసి రావాలని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చొదరి అప్పారావు పిలుపునిచ్చారు. మాధవధారలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై కార్యవర్గ సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డైరీని సంఘ చైర్మన్ సనపల బంగారురాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.శివప్రకాశరావు, కె.గణేష్, ఎ.నారాయణరావు, ఎం.ఎల్లయ్యరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్, రైతుబజార్ ప్రాంతాల్లో సోమవారం అధికారులు సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించాలని, వినియోగించిన వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాండురంగా, సచివాలయ సెక్రటరీ నానాజీ, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కేటింగ్ రోల్‌బాల్ పోటీల్లో విశాఖ రన్నరప్



రన్నరప్‌గా నిలిచిన విశాఖ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి రోజా(ఫైల్)

దాబాగార్డెన్స్: అండర్–17 స్కేటింగ్ రోల్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం రన్నరప్‌గా నిలిచింది. తిరుపతిలో గత శని, ఆదివారాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీ తిరుపతి–విశాఖపట్నం మధ్య జరిగింది. విజేతగా తిరుపతి, రన్నరప్‌గా విశాఖపట్నం నిలిచింది. మంత్రి రోజా నుంచి ట్రోఫీ అందుకున్నారు. మురళీనగర్ వైశాఖి స్కేటింగ్ పార్క్ కోచ్ సంతోష్‌కుమార్ నేతృత్వంలో విశాఖపట్నం టీం శిక్షణ పొందింది. ఈ నెల 31న కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో జరగనున్న నేషనల్ పోటీలకు విశాఖపట్నం నుంచి సుద్విక్, దీక్షిత ఎంపికయ్యారు.

ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ సేవలు

- అందుబాటులో వైద్య నిపుణులు
- రోజూ 70 మందికి వైద్య పరీక్షలు



దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సీతంపేట: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో ప్రజలకు వైద్యం మరింత చేరువైంది. జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాస్‌నగర్ దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నరసింహనగర్ ఆరోగ్య కేంద్రంలో 42, 43, 44 వార్డుల ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. గతంలో ఆయా వార్డుల ప్రజలు ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా.. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దూరాభారం కావడంతో దగ్గరలోని ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయించేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా డాక్టర్ కన్సల్టింగ్ ఫీజు, వైద్య పరీక్షలు, మందుల ఖర్చు భారంగా మారింది. ప్రజలకు వైద్యం భారం కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వార్డులో వైద్య సేవలు చేరువయ్యేలా పట్టణ ఆరోగ్య కేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేశారు. వీటిలో సాధారణ వైద్య సేవలతో పాటు స్పెషలిస్టు వైద్యుల సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎంతో ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా లభిస్తున్నాయి. ప్రతి రోజూ 50 నుంచి 70 మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు.

స్పెషలిస్ట్ వైద్య సేవల వివరాలు

- సాధారణ ఓపీ సేవలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు లభిస్తాయి.
- స్పెషలిస్ట్ ఓపీ సేవలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లభిస్తాయి.



చిన్నారికి రక్త పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

- ప్రతి సోమవారం: చిన్న పిల్లలకు సంబంధించిన వైద్య సేవలు(పీడియాట్రిక్స్), ఎముకల వైద్య సేవలు(ఆర్థో).
- మంగళవారం: సాధారణ శస్త్ర చికిత్స సేవలు(జనరల్ సర్జరీ).
- బుధవారం: ప్రసూతి వైద్య సేవలు(గైనకాలజీ), చెవి, ముక్కు, గొంతు వైద్య సేవలు, వృద్ధుల వైద్య సేవలు (జెరియాట్రిక్).
- గురువారం: ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్య సేవలు(పల్మనాలజీ).



పీడియాట్రిక్ వైద్య సేవల కోసం వచ్చిన పిల్లలు

- శుక్రవారం: చర్మ వ్యాధులు, జనరల్ మెడిసన్ వైద్య సేవలు.

ల్యాబ్ పరీక్షలు..

ప్రస్తుతం ఇక్కడ మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, ఎలక్ట్రోలైట్స్, సీబీసీ వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రక్తం నుంచి సీరంను వేరు చేసే సెంట్రిఫ్యూజ్ పరికరం లేక బయోకెమిస్ట్రీకి సంబంధించిన వైద్య పరీక్షలు జరగడం లేదు. సెంట్రిఫ్యూజ్ పరికరం అందుబాటులో ఉంటే మరో 20 రకాల వైద్య పరీక్షలకు ప్రజలకు ఉచితంగా అందుతాయి.

సమాచారమ్

అందుబాటులో జోన్–5 అధికారులు

సమస్యలు, సమాచారంపై ఫోన్ చేయండి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5లో ప్రజలకు సేవలందించడానికి అధికారులందరూ అందుబాటులో ఉన్నారు. జోనల్ కార్యాలయ పరిధిలో 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ పరిధికి సంబంధించి సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం అధికారులు పౌరులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తారు. జోన్ పరిధిలో సమస్యలు, సందేహాలపై కింద పేర్కొన్న అధికారుల నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. జోన్–5కు సంబంధించిన సమాచారం అడిగి తెలుసుకోవచ్చు.



జీవీఎంసీ జోన్–5 కార్యాలయం

జీవీఎంసీ జోన్–5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ (ప్రథమ అప్పిలేట్ అధికారి)	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్–1 పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్–2 పీఐవో(టౌన్‌ప్లానింగ్, పబ్లిక్‌హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీమ్డ్ పీఐవో)	99480 78507
డాక్టర్ ఎ.రాజేష్	అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (పబ్లిక్‌హెల్త్)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ (డీమ్డ్ పిఐవో)	81878 99199
ఆర్.బాబూరావు	అసిస్టెంట్ కమిషనర్–5 (రెవెన్యూ) డీమ్డ్ పీఐవో	83747 83932.
కె.పద్మావతి	సీడీవో, ఏపీడీ ఇన్‌చార్జి (యూసీడీ) డీమ్డ్ పీఐవో	89190 80201

నేతాజీకి ఘన నివాళి



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కె.కె.రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం నేతాజీ వంతెన రహదారిలో ఆయన విగ్రహానికి ముఖ్య అతిథులు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి సుభాష్ చంద్రబోస్ గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. దేశ సరిహద్దుల్లో రక్షణ కవచంలా ఉన్న జవాన్లు నేతాజీకి ప్రతిరూపమని అభివర్ణించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్లు కొణతాల నరసింగరావు, వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మురళీనగర్ పార్కులో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

త్యాగధనుడు సుభాష్ చంద్రబోస్

మురళీనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్యాగధనుడని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేతాజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సొంత సైన్యాన్ని తయారు చేసిన ధీరుడని అన్నారు. నేతాజీ జీవిత విశేషాలను వివరించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ పార్కు పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, ప్రస్తుత అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్వీ సుధాకర్, ఎం.వి.భాస్కరరావు, ఏవీ సుబ్బారావు, సూకరాజు, ఎం.రామకృష్ణ, జె.కూర్మారావు, కేజీ కృష్ణారావు, సీహెచ్ కృష్ణమూర్తి, జి.గంగయాచారి, ఎస్.సీతారామకృష్ణ, టీవీ రమణ, ఎంఎస్ఆర్ మూర్తి, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోసగించిన బాలుడిపై ఫిర్యాదు

సీతమ్మధార: నమ్మించి మోసం చేసిన కేసులో తనకు న్యాయం చేయాలని ఓ బాలిక నాలుగో పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. శంకరమఠం ప్రాంతంలో నివసిస్తున్న ఓ బాలిక సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తన స్నేహితురాలి ద్వారా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఓ బాలుడు పరిచయమయ్యాడు. కంచరపాలెం ఐటీఐలో ఆ బాలుడు చదువుతున్నాడు. వీరి మధ్య పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరూ హోటళ్లు, బీచ్‌ల వెంట తిరిగారు. పెళ్లి కోసం సదరు బాలుడు తన తల్లిదండ్రులను కూడా ఒప్పించాడు. ఈ క్రమంలో ఇద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీశాడు. ఇప్పుడు వాటితో సదరు బాలికను బంగారం, డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆ బాలిక కొంత నగదు, బంగారం ముట్టజెప్పినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అయినప్పటికీ బాలుడి ఆగడాలు ఆగకపోవడంతోపాటు కుటుంబ సభ్యులపై దాడులు చేయాలని ఒత్తిడి చేయడంతో బాలిక పోలీసులను ఆశ్రయించింది.

గడప గడపలో విశేష స్పందన



46వ వార్డులో మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం మధుసూదన్‌నగర్–2లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని స్థానికులకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాల విషయంలో జియో టాగింగ్‌పై ప్రజలకు ఉన్న అపోహలను కె.కె.రాజు నివృత్తి చేశారు. సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలంతా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, నాయకులు గోవింద్, క్రిష్ణ, రమణ, శ్రీను, రామారావు, లావణ్య, కె.ఈశ్వరరావు, సీతయ్యరెడ్డి, దేవి, బాల, నర్సింగరావు, అప్పారావు, కృపా, రాజు, సిద్ధార్థ, సురేష్, అశోక్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం ఉదయం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. పాల్గొనదలిచే భక్తులు వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించండి

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజును సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కొండపల్లి హస్తకళాకారులు తయారు చేసిన ఎడ్లబండిని బహూకరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ లేపాక్షి ఎంపోరియంల ద్వారా వస్తువులు కొనుగోలు చేసి హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. హస్తకళల అభివృద్ధికి కృషి చేస్తానని కె.కె.రాజు హామీ ఇచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చంద్రమౌళి, ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, విశాఖ లేపాక్షి మేనేజర్ విజయగౌరి, సిబ్బంది దయానంద్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కె.కె.రాజుకు ఎడ్లబండిని బహూకరిస్తున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

రైల్వేల అభివృద్ధికి ఉద్యోగుల కృషి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ డాక్టర్ వి.రవికిరణ్ ఆధ్వర్యంలో మర్రిపాలెం రైల్వే కాలనీలో వార్షిక జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఉద్యోగులు, సభ్యులను ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రతి ఉద్యోగి నియమ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి రైల్వేల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ బిస్వజిత్ పరీడా, జనరల్ సెక్రటరీ రంజన్‌కుమార్ దాస్‌లు మాట్లాడుతూ సమావేశాలను విజయవంతం చేసిన యూనియన్ సభ్యులు, డివిజనల్ సెక్రటరీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మజ్దూర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజనల్ సెక్రటరీగా మళ్లీ డాక్టర్ వి.రవికిరణ్ ఎన్నిక కాగా.. డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఎల్.విజయ్‌కుమార్, ట్రెజరర్‌గా చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. రవికిరణ్ మాట్లాడుతూ డివిజన్‌ను ప్రగతి పథంలో నడిపిస్తూ, రైల్వేల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతికి ధన్యవాదాలు తెలియజేశారు.



రైల్వే మజ్దూర్ యూనియన్ కొత్త కార్యవర్గం, సభ్యులతో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

నేటి నుంచి 'జయహో జనగణమన' వారోత్సవాలు

ఏయూ క్యాంపస్: స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్న జయహో జనగణమన వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణమన గీతాలాపన ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయ గీతంగా ఆమోదించి జనవరి 24కు 73 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు జిల్లాలో జనగణమన గీతాలాపన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 1న ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద ముగింపు కార్యక్రమం జరుపుతామని తెలిపారు.

10న పార్వతీశ్వరుడి కల్యాణోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సారిపిల్లి గోవింద్

సీతంపేట: స్థానిక గణేష్ నగర్‌లోని దేవదాయ శాఖ పరిధి పార్వతీశ్వరుడి ఆలయంలో ఫిబ్రవరి 10న స్వామి 33వ వార్షిక కల్యాణ మహోత్సవం జరగనుంది. కార్యక్రమ కరపత్రాలను సోమవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో అల్లు జగన్నాథరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 9న ఉదయం 9 గంటలకు స్వామి వారి మంగళస్నానం, 10వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్టాపన నిర్వహించనున్నామన్నారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణం, 11వ తేదీ సాయంత్రం మేళతాళాలతో స్వామి ఊరేగింపు జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగవరపు శివాజీశర్మ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నమ్మి పద్మావెంకట్, సభ్యులు మువ్వల రాజారావు, ఏదిరి లలిత, ఆలయ గుమస్తా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సుదర్శన యాగానికి అంకురార్పణ చేస్తున్న ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో 74వ బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కుర్తాళం, లలిత పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలను మొదలుపెట్టారు. సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 87వ జన్మదినోత్సవం సందర్భంగా లోక కల్యాణార్థం నవగ్రహ సహిత అష్టముఖ గండ భేరుండ జ్వాలానారసింహ సుదర్శన మహా యాగం, భాగవత సప్తాహ ప్రవచన యజ్ఞం, కాశీ కాలభైరవుల ప్రతిష్ట వంటి విశేష పూజలు ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతాయి.

దీనిలో భాగంగా సుదర్శన మహాయాగానికి అంకురార్పణ చేస్తూ ప్రారంభ సన్నాహక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మాతృకా పూజ, అంకురారోహణ, రక్షాబంధన, రుత్విగ్వరణం, అగ్ని మధనం, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశన, యాగ మండపారాధనలు, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం నిర్వహించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా మాఘ మాసం పూజలు



ప్రత్యేక అలంకరణలో త్రిముఖ విఘ్నేశ్వర స్వామి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీసూర్యనారాయణ, సీతారామలక్ష్మణ హనుమంత్ సహిత శివపార్వతి సమేత త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో సోమవారం మాఘ మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 28న రథసప్తమిని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి శ్రీసూర్యనారాయణమూర్తికి క్షీరాభిషేకం, 7 గంటల నుంచి పూజలు చేస్తామని అర్చకులు తెలిపారు. 29న ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, సూర్యనమస్కారాలు, 30న కృత్తిక నక్షత్రం సందర్భంగా ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 5న పౌర్ణమి సందర్భంగా ఉదయం 7 నుంచి సూర్యనారాయణమూర్తి స్వామికి అభిషేకాలు, 9 గంటల నుంచి చండీ హోమం, 9న సంకటచతుర్థి సందర్భంగా ఉదయం 9 నుంచి లక్ష్మీగణపతి హోమం, 12న ఉదయం 7 నుంచి అభిషేకాలు, 17న ఉదయం 7.50 గంటల నుంచి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిమిత్తం రాట మహోత్సవం, 18న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి కాశీవిశ్వేశ్వర స్వామికి అభిషేకాలు, ఉదయం 11 గంటలకు ప్రత్యేక రుద్రాభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు. మాఘ మాసం నెల రోజులు ఉదయం గోత్ర నామాలతో పూజలకు రూ.200, ప్రతి నెలా వచ్చే మాసశివరాత్రి రోజున రుద్రాభిషేకానికి రూ.100, పౌర్ణమి రోజున చండీ హోమానికి రూ.100, కృత్తిక నక్షత్రం రోజున సుబ్రహ్మణ్యస్వామి అభిషేకాలకు రూ.100 రుసుం చెల్లించి రశీదు తీసుకోవాలని కోరారు. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకుడు మూర్తి తెలిపారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో విద్యావేత్త రమణమూర్తి, హెచ్ఎం శ్రీనివాసులు

కంచరపాలెం: విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో చేపట్టిన మంత్రాస్‌లో భాగంగా సోమవారం 'పరీక్ష–పే–చర్చ' అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం–2లో హెచ్ఎం సిహెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కేంద్రీయ, ప్రభుత్వ, జెడ్పీ, జీవీఎంసీ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ముఖ్య అతిథి విద్యావేత్త కె.వి.రమణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా ఏయూ ఫైన్ ఆర్ట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.వి.రవి, కొడాలి రవి వ్యవహరించారు. కేవీ–2 ఆర్ట్ టీచర్ పి.వినోద్‌కుమార్ పర్యవేక్షించారు.